మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

» జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి



కోర్టు ఆవరణంలో మొక్కలు నాటుతున్న శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో వస్తున్న మార్పులను ఎదుర్కొనేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, జడ్జి వెంకటేశ్వర్లు, పీపీలు దీపారాణి, అన్వేష్ సింగ్, సమీనాబేగం, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లీశ్వరీ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మేడ్చల్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి మల్లీశ్వరీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం ఒక రోజు కార్యక్రమం కాదని, ప్రతిరోజు మన జీవితంలో ఒక భాగంగా భావించాలన్నారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుతో భూమిని హరితభూమిగా మార్చాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరం కలిసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శోభారాణి, శ్రీదేవి, సలీం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఆర్ పంచాయితీ

సర్కార్‌తో గ్రామ కార్యదర్శుల అమీతుమీ

గ్రామ పంచాయతీల్లో పరిపాలన మెరుగు పరచడంతో పాటు కార్యదర్శుల పనితీరులో పారదర్శకత తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్‌ను ఇటీవల అమల్లోకి తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్ ప్రభుత్వానికి, పంచాయతీ కార్యదర్శుల మధ్య సరికొత్త వివాదానికి తెర తీసింది. యాప్‌లో అటెండెన్స్‌తో పాటు ప్రభుత్వం సూచించిన ఇతర వివరాలను, ఫొటోలు అప్‌లోడ్ చేయలేమని కార్యదర్శులు లడాయ్‌కి దిగారు. యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నిరోజులుగా హాజరు నమోదు చేయకుండా నిరసన తెలుపుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. కాగా, ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి మంది కార్యదర్శులు ఆందోళన బాటపట్టారు.

- ఉదయం హాజరుపై వ్యతిరేకత
- డీఎస్ఆర్ యాప్ బహిష్కరణ
- 20 రోజులుగా అటెండెన్స్ వేయని వైనం
- షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఉన్నతాధికారుల నిర్ణయం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)/తాండూరు, జూన్ 5: పంచాయతీల్లో పాలన మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన 'డీఎస్ఆర్(డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్ కొత్త వివాదానికి తెరతీసింది. ఈ యాప్ వల్ల పారదర్శకత, పనితీరు మెరుగుపడుతుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ దీన్ని అమలు చేయాల్సిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు యాప్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తూ ఆందోళన బాట పట్టారు. గడిచిన 20 రోజుల నుంచి యాప్ ద్వారా నమోదు చేయాల్సిన అటెండెన్స్ కూడా వేసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వేయి మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆందోళనలో పాల్గొంటున్నారు. బేషరత్‌గా ప్రభుత్వం ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు యాప్‌లో అటెండెన్స్‌తో పాటు ప్రభుత్వం సూచించిన ఇతర వివరాలను, ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయరాదని తీర్మానించారు. ఇదిలా ఉంటే గ్రామ కార్యదర్శులు యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోకుంటే సీఎల్‌గా పరిగణించాలని డైరెక్టర్

మిగతా 7వ పేజీలో...

యాప్‌పై అభ్యంతరాలు

ఈ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఏ ప్రభుత్వ శాఖలో పనిచేసే సిబ్బందికి లేని విధంగా తమను మాత్రమే ఉదయం 7గంటలకే విధులు హాజరు కావాలని ఆదేశించడం తగదంటున్నారు. అలాగే పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అన్ని పనుల భారం తమపైనే పడుతుందని వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రాజీవ్ వికాసం దరఖాస్తుల పరిశీలనతో పాటు గ్రామంలో అన్ని పనులు తామే నిర్వహించాల్సి వస్తుందని చెబుతున్నారు. దీంతో ఉదయం 7గంటలకే వచ్చి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా హాజరు వేసుకోవడం, ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడం కష్టతరంగా ఉందని అంటున్నారు. మా వ్యక్తిగత అవసరాల కోసం కొనుగోలు చేసుకున్న ఫోన్లలో ఇప్పటికే 10 వరకు ప్రభుత్వ యాప్‌లను నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా అపుడప్పుడు ఫోన్లు హ్యాంగ్ అయి పనిచేయక ఇబ్బందులు పెడుతున్నాయంటున్నారు. ఇవి చాలదన్నట్లుగా ప్రభుత్వం డీఎస్ఆర్ యాప్ తీసుకువచ్చి రోజూ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించడంతో అసలు పనిచేయడమే కష్టంగా మారిందని వాపోతున్నారు. మా వ్యక్తిగత సమాచారం కూడా థర్డ్‌పార్టీ యాప్‌కు వెళ్లే అవకాశం ఉందని, మహిళా కార్యదర్శులు సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకునే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఉన్న యాప్‌లో కూడా వివరాలు నమోదు చేసేవారు. అయితే కొందరు గ్రామ కార్యదర్శులు ఏదో ఒక ఫొటో పెట్టి ఆ రోజుకు మమ అనిపించే వారు. ఇలాంటి వారి ఆటకట్టించేందుకే ఈ యాప్ తీసుకువచ్చామని అధికారులు చెబుతున్నారు.

సమాచారం

14న లోక్ అదాలత్

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక సంఖ్యలో కేసులను రాజీపడేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి వెంకటేశ్వర్లు, ఎస్పీ నారాయణరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపారాణి అన్వేష్‌సింగ్, సమీనాబేగం, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డ, శ్రీనివాస్, బాలకృష్ణరెడ్డి, దానయ్య, సీఐలు భీంకుమార్, సంతోష్, నగేష్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలు

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాల బాలికల కోసం బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 32 ఖాళీలు ఉన్నాయని, తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక్క కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు జూన్ 9 నుంచి 17 వరకు కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో లభిస్తాయని పేర్కొన్నారు. జూన్ 20న లాటరీ ద్వారా ఎంపిక జరుగుతుందని, వివరాలకు 86393 88553, 99085 98481 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఔషధగుణాల అల్లనేరేడు

- పండ్లకు యమ క్రేజ్!
- కిలో రూ.300

7

బడిబాటకు వేళాయె..

నేటి నుంచి 19 వరకు రోజుకో కార్యక్రమం

- సర్వం సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన
- జిల్లాలో మొత్తం 1,062 ప్రభుత్వ పాఠశాలలు



ఆదిభట్లలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా విద్యా శాఖ నిర్వహించే బడిబాట కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశారు. కొత్త విద్యా సంవత్సరంలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. బడిబాట సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేవిధంగా ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు కృషి చేయాల్సి ఉంటుంది. రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ బడీడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా ప్రయత్నించనున్నారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన కార్యచరణను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. బడిబాట కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సన్నద్ధం కాగా, అంగన్‌వాడీ చిన్నారులతోపాటు బాల కార్మికులు, బడీడు వయస్సు కలిగిన బయట ఉన్న పిల్లలు, అనాథలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా

మిగతా 8వ పేజీలో...

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

బడిబాట కార్యక్రమాలపై విద్యా శాఖ కార్యాచరణ రూపొందించింది. ఈనెల 6న గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల గురించి వివరించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరిగేలా బడిబాటలో భాగస్వాములు కావాలని వారిని కోరనున్నారు. 7న ఇంటింటి సర్వే నిర్వహించి బడీడు పిల్లల వివరాలు సేకరిస్తారు. 8 నుంచి 10వ తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బడిబయట ఉన్న పిల్లలతోపాటు అంగన్‌వాడీ పిల్లలను పాఠశాలల్లో నమోదు చేయాలి. 11న బడిబాట ఫలితాలపై సమీక్ష నిర్వహించాలి. 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు ప్రారంభించాలి, స్కూల్ యూనిఫాం దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేయాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ నిర్వహించాలి. 16న ఎఫ్ఎల్ఎన్, లీప్ దినోత్సవం, 17న విలీన విద్య, బాలికా దినోత్సవం నిర్వహించాలి. 18న మొక్కల పెంపకం దినోత్సవం నిర్వహించి తరగతి గదుల డిజటలైజేషన్‌పై అవగాహన కల్పిస్తారు. 19న విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.

ఎవరెస్ట్‌ను అధిరోహించిన గురుకుల ఆణిముత్యం

కీసర జూన్ 5(ఆంధ్రజ్యోతి): కీసర మండలం భోగారం మహాత్మా జ్యోతిరావు పూలే ఘట్‌కేసర్ బాలికల పాఠశాల విద్యార్థిని ఆర్ల శరణ్య గురుకుల పాఠశాల విద్యార్థుల బృందంతో కలిసి ఇటీవల నేపాల్‌లో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించింది. ఇలాగే భవిష్యత్తులో ఎన్నో సాహసవంతమైన విజయాలను అవలీలగా అందుకోవాలని పాఠశాల ప్రిన్స్‌పాల్ సంతోష్ ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



ఎవరెస్ట్ అధిరోహించిన శరణ్య



ఈవీఎం గోడౌన్ రికార్డులో సంతకం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పటిష్టంగా ఈవీఎంల భద్రత

» కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/కోట్‌పల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం అదనపు కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ విప్పారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎం భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఆయనతోపాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్‌హాలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

వికారాబాద్‌ను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ వినియోగం

మిగతా 8వ పేజీలో...



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి

మానవ వనరులకు కొదువలేదు

» ఉన్నత విద్యా మండలి గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భారత దేశం ప్రపంచానికి మానవ వనరులను అందిస్తున్నదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకు హాజరై మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)తోపాటు ఏఎస్ఆర్(అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)ఉండాలని సూచించారు. ఒక విద్యార్థి కళాశాలలో లెర్నర్‌గా ప్రవేశించి ఎర్నర్‌గా మారుతాడన్నారు. 21వ శతాబ్దం మొత్తం డిజిటల్‌మయమన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా టీసీఎస్ ప్రిన్సిపల్ కన్సల్టెంట్, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలకృష్ణ పెద్ది, సంస్థ చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.జానకీరాములు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



పొన్నాల్‌లో పాస్‌పుస్తకాన్ని పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట/మూడుచింతలపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందజేస్తున్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సదస్సులో స్వీకరించిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అర్జీలు సమర్పిస్తున్న ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి వస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇబ్బందులు కలగొద్దు

ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకే సారి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి పరిధిలోని కేశవరం గ్రామంలోని చౌకధరల దుకాణాన్ని పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు టోకెన్ వ్యవస్థను అనుసరించాలని, ఎంఎల్ఎస్ పాయింట్ల సమన్వయంతో బియ్యం నిల్వల ముందస్తు స్థానాన్ని అనుసరించాలన్నారు. అలాగే ప్రతీ షాపులో తగినంత స్టాకు నిల్వలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేశవరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్

తాండూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు అధ్యాపకులు కృషి చేయాలని వికారాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధంచి సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కావడంతో మెరుగైన బోధన అందించాలని, అన్ని గ్రూపులలో అడ్మిషన్లు పెంచాలని సూచించారు. గత సంవత్సర ఫలితాల దృష్ట్యా ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



తలకొండపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తలకొండపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బుగ్గ రాములు, బి.రామలయ్య అన్నారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు కోరారు. తలకొండపల్లి, చుక్కాపూర్ గ్రామాల్లో గురువారం బడిబాట ప్రచార జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి స్కూళ్లకు పోని పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులతో టీచర్లు మాట్లాడుతూ.. స్థానికుల సహకారంపైనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోటు బుక్కులు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తే తల్లిదండ్రులకు వేల రూపాయల ఆర్థిక భారం పడుతుందన్నారు. తమ పిల్లలకు సర్కారు బడిలోనే చేర్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో ఫలితాలొస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, మహేశ్వరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆంజనేయులు, నరసింహమూర్తి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గులాబీ సాగు.. లాభాలు బాగు

● ఎకరానికి నెలకు రూ.లక్ష వరకు ఆదాయం!



చించోడులో గులాబీ తోట

షాద్‌నగర్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటుతో ఊరుతో పాటు భూములూ కోల్పోయిన ఓ రైతు వేరే గ్రామంలో భూమి కొని గులాబీ సాగుతో లాభాలు అర్జిస్తున్నాడు. శంషాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన సిద్ధులు, మరో ఇద్దరు సోదరులకు మూడెకరాల భూమి ఉండేది. శంషాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం భూసేకరణలో వారి భూమి పోయింది. పరిహారం కింద ఒక్కొరికి రూ.3లక్షలొచ్చాయి. ఆ డబ్బుకు కొంత జమచేసి అప్పట్లో ఫరూక్ నగర్ మండలం చించోడులో రెండెకరాలు కొన్నారు. ఈ రెండేళ్ల క్రితం ఈ రెండెకరాల్లో 7వేల గులాబీ మొక్కలు నాటారు. రూ.25 ఒక మొక్క చొప్పున కొన్నారు. మొక్కలు నాటే సమయంలో రైతు మెలకువలు పాటించారు. ఎకరానికి మూడు టిప్పర్ల పశువుల ఎరువు తోడారు. దానిపై పల్చగా మట్టివేసి మొక్కలు నాటారు. ప్రస్తుతం గులాబీ పూలు విచ్చుకొని రెండో కోత కోస్తున్నాడు.

పూలకు ధర ఉంటే భారీ ఆదాయం

సీజన్‌లో ఎకరా విస్తీర్ణంలోని పూలను అమ్మితే నెలకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒక వేళ ధర కొంత తక్కువున్నా రూ.50వేలకు తగ్గదంటున్నారు. సీజన్‌లో కిలో పూలకు రూ.200 నుంచి రూ.250 వస్తుందని తెలిపారు. సీజన్ లేకున్నా కిలో రూ.50 తక్కువ ఉండదంటున్నారు. తమ రెండు ఎకరాల్లో రోజూ పది మంది కూలీలు పూలు తెంపేందుకు, ఇతరాలను పనిచేస్తారన్నారు. ఒక్కో మహిళా కూలీకి రోజుకు రూ.300 ఇస్తున్నారు. ఉదయం 9గంటలకొచ్చి సాయంత్రం 6గంటలకు వరకు పనిచేస్తారన్నారు. వారితో పాటు రైతు కుటుంబీకులూ పనిచేస్తారు. సిద్ధులు దంపతులు రోజూ ఉదయం శంషాబాద్ నుంచి చించోడు వచ్చి గులాబీ పూలను గుడిమల్కాపూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాడు. ఓపికగా పని చేసుకుంటే గులాబీ సాగులో మంచి లాభాలే వస్తాయని సిద్ధులు చెప్పాడు. పూలరెమ్మలు రాలకుండా ఉండేందుకు నెలలో రెండుసార్లు మందు పిచికారి చేస్తామన్నారు. అలా చేస్తే పది రోజులైనా పూల రెమ్మలు రాలవని, పూలు తాజాగా ఉంటాయని రైతు తెలిపాడు.

మెలకువలు పాటించాలి



గులాబీ సాగుకు భార్యాభర్తలం కష్టపడి పని చేసుకుంటాం. ఉదయమే పొలానికి వస్తాం. పూల తోటను కంటికి రెప్పలా చూసుకుంటాం. మిగతా పంటలతో పోలిస్తే గులాబీ సాగులో ప్రత్యేక మెలకువలు పాటించాలి. అది మరీ కష్టమేమీ కాదు. గులాబీ చేనుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉండదు. ఈ పంటతో లాభాలు బాగానే ఉంటాయి. పూలను సులభంగానే మార్కెటింగ్ చేసుకోవచ్చు. పూల సాగులో సాధారణంగా నష్టమయితే ఉండదు.

- సిద్ధులు, గులాబీ రైతు, చించోడు

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలి



శిబిరంలో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు రావని ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ మంజులాదేవి తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో వైద్యులు టీబీ, ఎయిడ్స్, షుగర్, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరంలో 198మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ రచనాసింగ్, శ్రీకాంత్, వైద్య బృందం నాగేశ్వరీ, విజయ్‌కుమార్, హలీం, భారతమ్మ, గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌదీ నుంచి తండాకు చేరిన మృతదేహం



బాబ్య మృతదేహం వద్ద కుటుంబీకులు

చౌదరిగూడ, జూన్5(ఆంధ్రజ్యోతి):బతుకు దెరువు కోసం సౌదీ వెళ్లి మే 27న గుండెపోటుతో అక్కడే మృతిచెందిన హెమ్లాతండా వాసి బాబ్య మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. బాబ్య మృతదేహాన్ని తండాకు తరలించేలా సహకరించాలని తండా వాసులు రవి, కిషన్, రామ్ చరణ్, వినోద్ రమేష్, వెంకట్, పాండునాయక్‌లు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య, ఎమ్మెల్యే కేటీఆర్‌లకు విన్నవించారు. వారు అక్కడి అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేలా కృషి చేసినట్లు తండా వాసులు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ కార్యకర్తగానూ పనిచేసిన బాబ్య కుటుంబానికి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే అండగా నిలవడం గొప్ప విషయం అని వారు అన్నారు.

రాక్‌వుడ్స్ స్కూల్ అధినేతకు ఎక్సలెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న రామానాయుడు

ఘట్‌కేసర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):పోచారం పరిధి యంనంపేట్‌లో గల రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్, ఓనస్ రొబోటిక్ హాస్పిటల్స్ చైర్మన్ ఎం.రామానాయుడు ఎక్సలెన్స్ అవార్డ్-2025 అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం యాదాద్రిలో ఇండో-యూకే గ్రీన్ డ్రైవ్ కార్యక్రమంలో గ్యారెత్‌విన్ ఓవెన్(బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్), స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యల నుంచి అవార్డును అందుకున్నారు. విద్యారంగం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్య రంగాల్లో ఆవిష్కరణల అంశాల్లో రామానాయుడు చేస్తున్న కృషికి ఫలితంగా ఈ అవార్డు దక్కిందని సంస్థల ప్రతినిధులు తెలిపారు. స్కూళ్ల నిర్వహణతో ఉత్తమ పౌరులను తయారు చేయడం, ఓనస్ రొబోటిక్ హాస్పిటల్స్ ద్వారా రోబోటిక్ సర్జరీలకు పునాది వేసే ప్రయత్నాలు చేస్తున్నందుకు అవార్డు వచ్చిందన్నారు. అవార్డుతో తనపై గురుతర బాధ్యత పెరిగిందని రామానాయుడు అన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



అర్చనను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుల్లో రాణించాలని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గ్రామానికి చెందిన కె.అర్చన ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 546/600 మార్కులు సాధించి, గ్రామీణ ప్రగతి ఉపకారవేతనానికి ఎంపికైంది. విద్యార్థినిని గురువారం మాజీ సర్పంచ్, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అర్చన తండ్రి ఆంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో నరేందర్‌జీ పాల్గొన్నారు.

గిర్మాపూర్‌లో కంటి వైద్య శిబిరం

మేడ్చల్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బస్తీ దవాఖానా ఆవరణలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

» క్వాలిటీ కంట్రోల్ డీఈ రజినీబాబు

ఆదిభట్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్) రజినీబాబు అన్నారు. మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ నుంచి రాచులూర్ వరకు రూ.30కోట్లతో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించి, నిబంధనల మేరకు పనులు చేయాలని సూచించారు. రోడ్డు మధ్యలో వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న కల్వర్టుల కొలతలను పరిశీలించామన్నారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఏఈ ప్రశాంతి, ఇబ్రహీంపట్నం ఆర్అండ్‌బి ఏఈ వినోద్‌కుమార్, కాంట్రాక్టరు ఉన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

చౌదరిగూడ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేవతామూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. గురువారం మండలంలోని రావిర్యాల పంచాయతీ పరిధి వీరసముద్రంలో సీతారామస్వామి, శివలింగం, ఆంజనేయస్వామి, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠ కార్యక్రమాలను రెండో రోజు పూజారి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవతామూర్తుల ధాన్యాదివాసం, జలాదివాసంనిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాస్కరయోగి, తదితరులు

'రమణ మహర్షి జీవిత చరిత్ర' పుస్తకావిష్కరణ

షాద్‌నగర్ అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కర్ణకోట రాజాజీ రచించిన 'శ్రీ రమణ మహర్షి జీవిత చరిత్ర' పద్య కావ్యాన్ని ప్రముఖ కవి భాస్కరయోగి ఆవిష్కరించారు. విజయనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వేత్త రమణ మహర్షి, జగద్గురు శంకరాచార్యుల దారిలో ప్రయాణించి భక్తి భావాన్ని వ్యాప్తి చేశారన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ వంటి వారు రమణ మహర్షి ఆశీర్వాదం పొందారని తెలిపారు. రచయిత రాజాజీని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు నాగుల యాదగిరి, జగదీశ్వర్, స్వరాజ్ బాబు, కర్ణకోట రవీంద్రనాథ్, నక్క నర్సింహులు, బాలగోపాల్, శంర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆమనగల్లు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ పాటుపడుతోందని ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఫౌండేషన్ లక్ష్యం అన్నారు. కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో గురువారం రాఘవేందర్‌రెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జంగారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి నూతనాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి సుంకిరెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆయానికి ఫౌండేషన్ ద్వారా రూ.5లక్షలు అందించారు. నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఆలయాలభివృద్ధికి, దైవకార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సేవా కార్యక్రమాల్లో ఐక్యత ఫౌండేషన్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, అల్వాల్‌రెడ్డి, శ్రీధర్, పి.పరమేశ్వర్, ఎల్.తిరుపతయ్య, ఎల్.లాలయ్య, జి.బాలస్వామి, లింగం శ్రీను, బన్నె శ్రీను, బన్నె మల్లయ్య, ఎం.బుచ్చిరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛత కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది

పూడూర్‌లో స్వచ్ఛ భారత్

మేడ్చల్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పైప్‌లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణ పరిధి పూడూర్‌లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కంపెనీ ఉద్యోగులు శివాలయ పరిసరాల్లో చెత్తను ఏరేసి శుభ్రపరిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

మోమిన్‌పేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని వివిధ గ్రామాల ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం పాఠ్యపుస్తకాలు అందజేశారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమేశ్, నాగేశ్వర్, సీఆర్పీలు శ్రీనివాస్, పిచ్చయ్య, సిబ్బంది జహంగీర్ పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

డీఎస్ఆర్ పంచాయితీ

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ ఇటీవల ఆదేశించారు. అలాగే షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఒకవేళ ఇదే జరిగితే గ్రామ కార్యదర్శులంతా మూకుమ్మడి సెలవులోకి వెళ్తామని ప్రభుత్వానికి అల్టిమేటమ్ ఇచ్చారు. ఇప్పటికే పాలకవర్గాలు లేక డీలాపడిన పల్లెల్లో ఈ కొత్త యాప్‌వల్ల ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీ కార్యదర్శుల మధ్య సరికొత్త వివాదానికి కారణమై పల్లె పురోగతిపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి పంచాయతీల్లో నిధులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలు నిధులకు కటకటలాడుతున్నాయి. దీంతో పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఏదో తిప్పలు పడి కొన్ని పనులు చక్కబెడుతున్నారు. కొన్ని నెలలుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో గ్రామ పంచాయతీకి అప్పుగా సామగ్రి ఇచ్చే దుకాణదారులు, ఫార్మ్‌లు ఎవరూ కూడా అప్పు ఇవ్వడం లేదని, పెట్రోల్ బంకుల్లో డీజిల్ పోయడం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామే సొంతంగా రూ.లక్షల్లో అప్పులు చేసి మరీ గ్రామ పంచాయతీలను నిర్వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. మరోవైపు 2011 జనాభా లెక్కల ప్రకారమే సిబ్బంది ఉన్నారని, సరిపోను లేకపోవడంతో పనిభారం అనేక రెట్లు పెరిగిందని చెబుతున్నారు. యాప్ ద్వారా అన్ని పనులు చేయాలంటే ప్రతీ 100 మంది జనాభాకు ఒకరి చొప్పున సిబ్బందిని మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డీఎస్ఆర్ యాప్ ద్వారా...

గ్రామ పంచాయతీల్లో పరిపాలన మెరుగు పరచడంతో పాటు సిబ్బందిలో పారదర్శకత తెచ్చే పేరుతో ప్రభుత్వం 'డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్టు) యాప్‌ను ఇటీవల అమల్లోకి తెచ్చింది. గతంలోనే ఈ తరహా యాప్ అమల్లో ఉన్నప్పటికీ ఇటీవల దీనిలో అనేక మార్పులు తీసుకువచ్చారు. కొత్తగా తీసుకువచ్చిన యాప్ ప్రకారం ఉదయం 7గంటల నుంచి 8గంటల మధ్య కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి ఫేస్ రికగ్నిజేషన్, లైవ్ లోకేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. అనంతరం పంచాయతీ కార్యాలయం లోపల, బయట ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ఉదయం 8గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా హాజరు పడదు. అలాగే గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, స్కూళ్లల్లో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి వీటి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పని సులభతరంగా ఉండేందుకు గ్రామాన్ని జోన్లుగా విభజించారు. అదే విధంగా రోజు వారీగా ఇంటింటికీ వచ్చేటటువంటి తడి, పొడి చెత్త వేరు చేయించి, వీటిని తూకం వేయించి, ఈ సమాచారాన్ని యాప్‌లో నిక్షిప్తం చేయాలి. పల్లె ప్రగతి పనులతోపాటు విద్యుత్ బిల్లులు, బర్త్, డెత్ వివరాలను నమోదు చేయాలి. అయితే ఉదయం 8గంటలకే హాజరు అనేదానిపై గ్రామ కార్యదర్శులు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం ఆలస్యంగా హాజరు నమోదు చేసిన వారి విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదని 9గంటల వరకు కూడా హాజరు నమోదు చేసుకోవచ్చని ఓ అధికారి తెలిపారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

వేర్వేరు పంటల సాగుతో రైతులకు మేలు

కలిసిరానున్న పెట్టుబడి వ్యయం ● అదుపులో చీడపీడలు



చేవెళ్లలో టమాట తోట

చేవెళ్ల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసిన పంటలే మళ్లీమళ్లీ వేస్తూ రైతులు దిగుబడి నష్టపోతున్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించకుంటే చేలలో చీడపీడల వ్యాప్తి ఎక్కువవుతుంది. తరచూ ఒకే పంట సాగుతో భూమి నిస్సారంగా మారుతుంది. సహజ పోషకాలున్నీ వినియోగంకావు. ఈ సమస్యను అధిగమించేందుకు పంటమార్పిడి చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ పంటకు మార్పులు చేస్తే భూమిలోని సారం పూర్తిగా మొక్కలకు అంది దిగుబడి పెరుగుతుందంటున్నారు. పెట్టుబడీ ఖర్చూ తగ్గుతుంది. ఇంత కీలకమైన పంట మార్పిడి గురించి వ్యవసాయాధికారులు ఇంకా ఏమంటున్నారంటే..

పాటించాల్సిన మెలకువలు ...

- నేల ఉపరితలాన్ని కప్పేసే కొమ్మలు కలిగిన పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బెబ్బెర, పెసర, మినుము పంటలు నేలను కప్పి ఉంచుతాయి. నీడలో కలుపు మొక్కలు ఎక్కువగా పెరగవు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరుకు వేసుకుంటే సుడిదోమ, తుంగ్రోవైరస్‌లను అరికట్టొచ్చు.
- పత్తి సాగు చేసిన భూమిలో తదుపరి పంటగా మినుము, పెసర వంటివి వేస్తే తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది. వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగుచేయాలి. పసుపు తర్వాత వరి, జొన్న సాగు చేసుకోవాలి.
- నులి పురుగు సమస్య ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు వంగ పంటల సాగును కొంతకాలం నిలిపివేయాలి.

ఇలా చేసుకోవచ్చు

యాసంగిలో వేరుశనగ వేసిన చోట వానాకాలంలో మొక్కజొన్న వేసుకుంటే పైరుకు నత్రజని లభిస్తుంది. కంది, శనగ, పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి ఎక్కువ. దీని నివారణకు జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి(ఒట్టొరి) వంటి పంటలు వేసుకోవాలి. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసేవారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్య పంటలు వేసుకోవాలి. కంది, శనగ, మినుము పంటలను వేరుశనగతో మార్చుకోవచ్చు. వరి పైరును దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగజాతి కూరగాయ పంటలతో మార్పిడి చేసుకోవాలి. ఉల్లిరైతులు మరుసటి పంటగా ధాన్యపంటలు వేయాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజి పంటలపై లద్దె పురుగు తాకిడిని అధికట్టేందుకు జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు పంటలను వేయాలి.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పిడికి ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంపిక చేసుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థతో నేల పైపొర పోషకాలను గ్రహిస్తాయి. అపరాలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. వాటి ఆకులు ఎరువుగా మారుతాయి. రేగడి నేలల్లో సోయా చిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ ఎరువు లభిస్తుంది.

ఏటా పంట మార్పిడి చేస్తే...

- నేల భూ భౌతికస్థితి మెరుగవుతుంది.
- భూమిలో నీటినిల్వ సామర్థ్యం పెరిగి భూసారం వృద్ధిచెందుతుంది.
- చీడపీడల నివారణ మరింత సమర్థంగా చేపట్టొచ్చు.
- సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంద్ర వ్యాధులను నివారించొచ్చు.
- కలుపు మొక్కలు, వాటి విత్తనాలు కొంత మేర నాశనమవుతాయి.
- పంటకు మేలుచేసే వానపాములు వృద్ధి చెందుతాయి.

ఇలా చేయొద్దు

పంట మార్పిడికి అనుకూల పంటలనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి మరింత ఎక్కువవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఈ రెండు పంటలపై ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయొద్దు. పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజి, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, బెండ వేయొద్దు. ఆకుముడత రోగం ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు పంటలు వేసుకోవద్దు.

అధికారుల సూచనలు పాటించాలి



రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలి. ప్రతీ సంవత్సరం ఒకే పంట సాగుచేస్తే దిగుబడులు తగ్గుతాయి. పెట్టుబడి ఎక్కువ అవుతుంది. పంట మార్పిడితో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. దీంతో పంట ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుంది.

- శంకర్‌లాల్, ఏవో చేవెళ్ల



ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని షాపు యజమానికి నోటీసులు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రవీంద్ర సాగర్ తెలిపారు. గురువారం షాపుల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా విధిస్తామని, షాపు లైసెన్స్ రద్దు చేస్తామంటూ హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజలు కూడా వీటి వాడకాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేలా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా పార్కు స్థలాల్లో మొక్కలు నాటేందుకు మున్సిపల్ సిబ్బంది గుంతలు తీశారు.

బాలికపై అత్యాచారయత్నం

దోమ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 13ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బాలికపై యాదయ్య(24) గురువారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. బాలిక కేకలు వేయగా సమీప ఇళ్లలోని వారొచ్చి యాదయ్యను పట్టుకునేందుకు చూడగా అతడు పారిపోయినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రైతుల ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తాం



అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. గురువారం మొండిగౌరెల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ భూ సంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజావసరాలకు ప్రభుత్వం భూసేకరణ చేసినా తగిన పరిహారం ఇస్తుందని తెలిపారు. మొండిగౌరెల్లిలో 19, 68, 127 సర్వే నంబర్ల అసైన్డ్ పరిశీలించారు. తమ పంట భూములు తీసుకోవద్దని రైతులు ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ టి.అయ్యప్ప, ఆర్ఐలు రామకృష్ణ, డీటీ కీర్తిసాగర్ తదితరులున్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత



కొడంగల్-తాండూర్ రోడ్డుపై గుంతల పూడ్చివేత ఇలా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొడంగల్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహబుబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నిర్మిస్తున్న కొడంగల్-తాండూర్ జాతీయ రహదారి గుంతలమయమైంది. వాహనదారుల ఇబ్బందులపై మే 30న 'రహదారి గుంతలమయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గుంతల్లో కంకర, మట్టి పోయించారు.

ఔషధ గుణాల అల్లనేరేడు

- పండ్లకు యమ క్రేజ్! ● కిలో రూ.300
- జోరందుకున్న అమ్మకాలు
- ధర ఎంతున్నా తినాలంటున్న వైద్యులు



పరిగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే అల్లనేరేడు పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో కాపుకొచ్చే అల్లనేరేడు పండ్లను తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. అల్లనేరేడులో చాలా ఔషధ గుణాలున్నాయి. వీటిని తింటే ఆరోగ్యానికి మేలని ప్రజల నమ్మకం. వైద్యులూ అదే చెబుతున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో బండ్లపై అల్లనేరేడు పండ్లు విరివిగా అమ్ముతున్నారు. నాణ్యత కలిగిన కిలో పండ్లు రూ.250 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు. ఈ ప్రాంత పొలాల్లో, అడవుల్లో లభించే పండ్లు మార్కెట్లలో అమ్ముతున్నారు. పరిగి, వికారాబాద్‌లలో ఏ రోడ్డులో చూసినా అల్లనేరేడు పండ్ల అమ్మకాలు కన్పిస్తున్నాయి. కాగా పూడూరు, దోమ, ఊటుపల్లి గ్రామాల్లో నల్లనేరేడు తోటలను సాగుచేస్తున్నారు. పండ్లను రైతులు హైదరాబాద్, ఇతర పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఆరోగ్యానికి మేలు చేసే పండు



అల్లనేరేడు పండ్లలో ఔషధ లక్షణాలు ఎక్కువ. ఈ పండ్లు తింటే శరీరానికి చలువ చేస్తుంది. వేడి తగ్గుతుంది. డయాబెటిస్(మధుమేహ) రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరంలోని చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. సీజన్‌లో ప్రతి ఒక్కరు రోజుకు కనీసం పది పండ్లయినా తింటే ఎంతో మంచిది. కిడ్నీ వ్యాధులను అల్లనేరేడు నయం చేస్తుంది. చిన్నసైజు రాళ్లంటే ఈ పండ్లు ఎక్కువ తింటే కరిగిపోయే అవకాశం ఉంది. ఇలా ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా మల్టీ విటమిన్ గల ఈ ఫ్రూట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ధర ఎంతున్నా ఈ పండు తినడం అందరికీ ఎంతో మంచిది.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి

ఐపీఎల్ చాలెంజ్.. యువకుడి వింత చేష్టలు

» మెడలో చెప్పుల దండతో హల్‌చల్



మెడలో చెప్పుల దండ వేసుకున్న సాయి

తాండూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్-25 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్-బెంగళూరు(ఆర్సీబీ) గెలిస్తే తాను మెడలో చెప్పుల దండతో ఊరేగుతానని తాండూరుకు చెందిన సాయి అనే యువకుడు రీల్స్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ చేశాడు. పోటీల్లో ఆర్సీబీ విజయం సాధించడంతో పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన సాయి గుండు చేయించుకొని, మెడలో చెప్పుల దండతో తాండూరు బస్టాండ్‌లో తిరిగిన వీడియోను మరోసారి వైరల్ చేశాడు. ఇలా చేయడం తనకు సంతోషంగా ఉందని ఆ వీడియోలో చెప్పాడు. గతంలో క్వాలిఫైయర్‌లో పంజాబ్ గెలిస్తే చొక్కా లేకుండా తిరుగుతానని చెప్పిన సాయి.. అదె టీం గెలవడంతో తాండూరు ఇందిర చౌక్ వద్ద చొక్కా లేకుండా తిరిగి వీడియోను అప్‌లోడ్ చేశాడు. ఆ యువకుడికి పిచ్చి ముదిరిందని నెటిజన్లు స్పందించారు. ఇదిలా ఉంటే వింత చేష్టలు చేసిన సాయిని, అతడి తల్లిదండ్రులను తాండూరు టౌన్ సీఐ సంతోశ్‌కుమార్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పి పంపించారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌లో తాగునీటి సమస్య తీర్చండి

మేడ్చల్ టౌన్ జూన్ 5(ఆంధ్రజ్యోతి):మేడ్చల్ మున్సిపాలిటీ ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ పట్టణ నాయకులు ఆరోపించారు. నాయకులు కమిషనర్ నాగిరెడ్డి గురువారం కార్యాలయంలో సమావేశమై సమస్యలపై వివరించారు. ప్రతీ బస్తీలో మూడు నాలుగు రోజులకోసారి నల్లా వస్తోందని, కనీసం రోజువిడిచి రోజైనా నల్లా వదలాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు చేపడుతున్నా బిల్లులు రావడం లేదని ఫిర్యాదు చేశారు. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారిని కోరారు. సమావేశంలో నాయకులు శైలజ, మురళీధర్ గుప్తా, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పరిగి: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారిణి నాగుల శిల్ప


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగ్ కళాశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు


కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్


ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

పర్యావరణాన్ని రక్షించుకుందాం

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకుందామని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొక్కలు నాటారు. అదేవిధంగా 100డేస్ ప్రోగ్రామ్‌లో భాగంగా ర్యాలీలు నిర్వహించారు.


పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడలో మొక్కలు నాటుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి


కొడంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది


దుద్యాల: హకీంపేట్ పల్లెదవాఖానా ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్య సిబ్బంది


ధారూరు: అల్లీపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో నర్సింహులు


పరిగి: మహిళలకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటయ్య


నవాబుపేట: మొక్కలు నాటుతున్న హరిత సేన నవాబుపేట మండల ఇన్‌చార్జి శాంత్‌కుమార్, తదితరులు


పరిగి: సయ్యద్‌పల్లిలో మొక్కలు నాటుతున్న పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌రావు

డబీల్‌పూర్‌లో ఇళ్లపట్టాల పంపిణీ


ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్5 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వార్డు కార్యాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వారికి ఇళ్ల పట్టాలను అందజేశారు. గ్రామంలో అర్హులుంటే ఇందిరమ్మ కమిటీ దృష్టికి తీసుకొస్తే మంజూరయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరావు, విఘ్నేశ్వర్ రెడ్డి, వెంకటేశ్, శ్రీరాంరెడ్డి, సలాం పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆరోగ్య నియమాలు పాటించాలని సిద్దులూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్దులూర్‌లో గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 120మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, వైద్యబృందం పాల్గొన్నారు.


అధికారుల సూచనలు పాటించాలి

కులకచర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టి.లక్ష్మణ్ అన్నారు. స్థానిక రైతు వేదికలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు వ్యవసాయ పంటల సాగు విధానం, వాడాల్సిన ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి, పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మీకుమారి, మండల వ్యవసాయ అధికారి వీరస్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు బీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

దుద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాటం చేయాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం జేఏసీ కన్వీనర్, న్యాయవాది బోయిని వెంకటయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ముదిరాజ్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ డీ నుంచి ఏ లోకి మార్చుతామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. హక్కుల సాధనకు భవిష్యత్ కార్యచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు మెరుగు వెంకటయ్య, బాల్‌రాజ్, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు


వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జరిగిన పలు వివాహాది వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా వివాహాది కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల మహిపాల్, వెంకటమ్మ, పకీరప్ప, తోక ఆశప్ప, శిరీష రమేశ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: మండలానికి చెందిన మహేందర్ రమేష్ కూతురు వివాహం తాండూరులోని ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ వివాహానికి యాలాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కోఆప్షన్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, రాపోల్ నాగయ్య, హైమద్, గొల్ల చందు, మారుతి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు


శామీర్‌పేట: పొన్నాల్ గ్రామంలో రైతు పాస్‌పుస్తకాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. మండలంలోని పొన్నాల్ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. సదస్సులో స్వీకరించిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వస్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు అధికారుల దృష్టికి వస్తే వెంటనే తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని ఎన్కెపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఆర్ఐ శిరీష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని రుద్రారం, నాగారం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 24దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, ప్రతాప్‌సింగారం వార్డు కార్యాలయంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, తహసీల్దారు డీఎస్ రజిని పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దుద్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పాల్గొని అధికారులు రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. సదస్సులో రైతుల నుంచి 80 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని రుద్రారంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి తహసీల్దార్ విజయ్‌కుమార్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

దోమ: మండలంలోని లింగన్‌పల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ గోవిందమ్మ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఆర్ఐలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: గౌతాపూర్‌లో తహసీల్దార్ తారాసింగ్ రెవెన్యూ సదస్సు నిర్వహించగా ఆరు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అదేవిధంగా గోపన్‌పల్లిలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయన్నారు.

కులకచర్ల: తిరుమలాపూర్‌లో తహసీల్దార్ మనోహరచక్రవర్తి గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ఆర్ఐలు ఖాజా, రాఘవేంద్రచారి పాల్గొన్నారు.

నవాబుపేట: అక్నాపూర్, పులుమామిడి గ్రామాల్లో తహసీల్దార్ బుచ్చయ్య గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అక్నాపూర్‌లో 37, పులుమామిడిలో 25మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు రాజు, రజిత, సిబ్బంది పాల్గొన్నారు.


దుద్యాల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బడిబాటకు వేళాయె..

(ఐదో పేజీ తరువాయి)

కృషి చేయనున్నారు. చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో, ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో చేర్పించేందుకు శుక్రవారం నుంచి ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రయత్నం చేయనున్నారు.

బడీడు పిల్లలపై ఆరా

జిల్లాలో మొత్తం 1,062 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా, ఈ పాఠశాలల్లో నేటి నుంచి బడిబాట నిర్వహించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బడి బయట ఉన్న బడీడు పిల్లల గురించి ఆరా తీసి నమోదు చేసుకుంటున్నారు. గతేడాది నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థుల చేరికలు జరగలేవు. అయితే ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఎక్కువ చేరికలే లక్ష్యం

కొత్త విద్యా సంవత్సరంలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల చేరికలే లక్ష్యంగా విద్యా శాఖ సన్నద్ధమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం, ఏఐ విద్యా బోధన, డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్‌కు ధీటుగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారంటూ ఉపాధ్యాయులు ఇప్పటికే విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నా.. చేరికలు ఎందుకు తక్కువగా ఉంటున్నాయనేది ప్రశ్నార్థంగా మారింది. ప్రతిఏటా బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉంటున్న విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న విద్యా శాఖ ఉన్నతాధికారులు ఈసారి చేరికలు పెంపొందించే భారం ఉపాధ్యాయులపై ఉంచారు. ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రకారం బడిబాట నిర్వహించాల్సి ఉంటుంది. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీలు, యువజన సంఘాల సహకారం కూడా తీసుకోనున్నారు.

మండలం	అవసరమైన పాఠ్య పుస్తకాలు	వచ్చినవి
బషీరాబాద్	23,488	21,350
పెద్దేముల్	21,878	20,300
యాలాల	28,401	25,140
తాండూరు	50,955	42,000


నేటి నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ

తాండూరు: పాఠశాలలు మరో ఆరు రోజులలో ప్రారంభం కానున్నాయి. మరోవైపు శుక్రవారం నుంచి 'బడిబాట' కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నియోజకవర్గంలో తాండూరు పట్టణంతోపాటు పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, తాండూరు మండలాలున్నాయి. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పాఠశాల తెరిచే రోజునే పాఠ్యపుస్తకాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, తాండూరు పట్టణం కలిపి 1,245,720 పాఠ్య పుస్తకాలు అవసరమని మండల విద్యాధికారులు ఇండెంట్‌ను డీఈవోకు నివేదించారు. ప్రస్తుతం 1,08,790 పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో ఇంగ్లిష్, తెలుగు మీడియాలున్నాయి. నేటి నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయనున్నారు.

పటిష్టంగా ఈవీఎంల భద్రత

(ఐదో పేజీ తరువాయి)

మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. మొక్కలు నాటడం, పెంచడం జీవన విధానంలో భాగం కావాలన్నారు. భవిష్యత్‌తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి వాటిని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతగిరి అర్బన్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. త్వరలో అనంతగిరిని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, అటవీ రేంజ్ అధికారి శ్యామ్ కుమార్, రాజేందర్, ప్రతిమ, అటవీ సెక్షన్ అధికారి అరుణ, ఉద్యాన్ కేర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, విద్యార్థినులు, సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


రాంపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి

భూ రికార్డులలోని వివరాలను పూర్తిగా సేకరించి, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా గురువారం కోట్‌పల్లి మండలంలోని రాంపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. సరిపడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు అవకాశం ఉండకూడదని, ఏవైనా సందేహాలుంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారాన్ని ఆర్‌ఓఆర్ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమ నిర్వహణ గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, మండల తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అటవీ భూమిలో మట్టిని తరలిస్తున్న జేసీబీలు, టిప్పర్ల పట్టివేత

మూడుచింతలపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని అటవీభూమిలో నుంచి కొందరు అక్రమార్కులు అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీలు, టిప్పర్లను అటవీ అధికారులు పట్టుకున్నారు. తవ్వకాలు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో బుధవారం అర్ధరాత్రి అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అటవీ భూమిలో మట్టి తవ్వకాలు తరలింపులు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు మూడేళ్లు జైలు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు రెండో ఎఎస్‌జే కుషాయిగూడ న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధించింది. ఈమేరకు ఘట్‌కేసర్ సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌కు చెందిన సార జైపాల్‌గౌడ్‌తో 22ఏళ్ల కిందట జ్యోతితో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. మద్యానికి బానిసైన జైపాల్‌గౌడ్ తరుచూ భార్య జ్యోతిని కొడుతూ చిత్రహింసలకు గురిచేస్తూ హత్యాయత్నానికి పాల్పడేవాడు. ఇవ్వన్నీ భరించలేక భార్య జ్యోతి 2024 జూలై 5న ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం జైపాల్ గౌడ్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ, రూ.1500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సాకు చెందిన ప్రశాంత్‌కుమార్ జెనా కుటుంబసభ్యులతో కలిసి అన్నోజిగూడ ఎల్ఐజీ కాలనీలో ఉంటూ ప్లంబర్ పనిచేస్తున్నాడు. కాగా భార్య రష్మిత జెనా(40) బుధవారం ఆమె వాష్‌రూంలో వాటర్‌హీటర్ ఆన్‌చేసింది. ప్రమాదవశాత్తు ఆమెకు విద్యుత్‌షాక్ తగిలింది. గమనించిన పిల్లలు స్థానికులకు సమాచారం అందించారు. వారు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆమె ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రష్మిత జెనా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి బంధువులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పూడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మండలంలోని కండ్లపల్లి గ్రామ శివారులోని నీలగిరి చెట్ల వద్ద గురువారం ఓ మహిళ(55) మృతదేహాన్ని గుర్తించామన్నారు. సదరు మహిళ మూడు రోజుల కిందట మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతురాలి ఒంటిపై నీలి రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్, ఎడమ చేతికి ఉంగరం ధరించిందని తెలిపారు. మృతురాలు భిక్షాటన చేసే మహిళగా కనిపిస్తోందని ఎస్ఐ వివరించారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

మేడ్చల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎల్ఆర్ ఫైజ్-2లో గురువారం ఉదయం అతివేగంతో వెళ్తున్న వాటర్ ట్యాంకర్ బోల్తా కొట్టింది. వంద ఫీట్ల రోడ్డుపై ప్రజలు మార్నింగ్ వాకింగ్ చేస్తుండగా వాటర్‌ట్యాంక్‌తో ఉన్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాకర్స్ అప్రమత్తమై పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

చౌడాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందించాలని ఎంపీడీవో సోమలింగం సూచించారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులు యూనిఫాంలు కుట్టే కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. 92 శాతం కుట్టు పనులు పూర్తయినట్లు తెలిపారు. త్వరలోనే యూనిఫాంలను పాఠశాలల్లోని విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేశ్, సీసీ అరుణ పాల్గొన్నారు.


క్యూబా ప్రజల కోసం విరాళాల సేకరణ

ఘట్‌కేసర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్యూబాపై అమెరికా చేస్తున్న దౌర్జన్యాలు, ఆంక్షలపై ప్రపంచ మానవాళి ప్రతిఘటించాలని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు చింతల యాదయ్య అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం క్యూబా సంఘీభావ నిధిని సేకరించారు. క్యూబా ప్రజలకు అండగా ఉండాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు విరాళాలను సేకరించేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబిత, యాదగిరి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

బొంరాస్‌పేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని బొంరాస్‌పేట్ జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సదుపాయాల గురించి అవగాహన కల్పించారు.

15న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన యువకుడికి షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

తాండూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వారం రోజులుగా విలియమూన్ మైదానంలో జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో తాండూరుతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 64టీమ్‌లు పాల్గొంటున్నాయి. గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్, తదితరులు షీల్డ్‌ను అందజేశారు.